

సహచరులతో సరదా కబుర్లు

# పట్టాలతో మురిసి.. ఆనందంతో తడిసి

## జీఎంసీ 2008 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం



తల్లిదండ్రులతో కలిసి వస్తున్న విద్యార్థులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల (జీఎంసీ) 2008 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం జింకానా ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి రావడంతో కళాశాలలో పండగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ దుస్తులతో వచ్చిన విద్యార్థినులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నల్లటోపీ, కోటుతో ఉన్న తమ పిల్లలను కెమెరాల్లో బంధించి తల్లిదండ్రులు మురిసిపోయారు. తమ బిడ్డల్ని వైద్యులుగా చూడాలన్న కల నెరవేరడంతో సంబరపడ్డారు.

ఆకాశమే హద్దుగా..: వైద్య వృత్తిలో ఉన్న వారు నూతన విషయాలు తెలుసుకోవడానికి ఆకాశమే హద్దుగా ముందడుగు వేయాలని కార్డియోథొరాసిక్ సర్జన్ గోపాలకృష్ణ గోఖలే సూచించారు. జింకానా ఆడిటోరియంలో జరిగిన స్నాతకోత్సవ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన గోఖలే మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. రోగులకు నిబద్ధతతో సేవలందించాలన్నారు. డబ్బుకు, ప్రలోభాలకు లొంగవద్దని హితవు పలికారు. వైద్య వృత్తి పట్ల విశ్వాసం చెక్కు చెదరకుండా చూసుకోవడం మనందరి బాధ్యతన్నారు. ఎంబీబీఎస్ పూర్తయిన తర్వాత ఏ పీజీ చదవాలనేది మీ ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉంటుందన్నారు. దాన్ని సాధించేందుకు నిరంతరం కష్టపడి చదవాలన్నారు. వైద్య వృత్తిలో ఉన్న వారంతా ఆధునిక చికిత్సా విధానాల గురించి నిత్యం తెలుసుకోవాల్సిందేనన్నారు. ఇందుకు ఎంతో శ్రమపడాల్సి ఉందన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ శైలబాల మాట్లాడుతూ ఇక నుంచి రోగులకు చికిత్స చేయడానికి మీ అందరికీ అర్హత వచ్చిందన్నారు. వైద్యులకు సంబంధించిన నైతిక నియమావళిని పాటించాలని సూచించారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థిగా ఇక్కడకు రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అంతకు ముందు ఆమె జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం చివర్లో విద్యార్థులకు ముఖ్య అతిథి గోఖలే పట్టాలను అందజేశారు. వైద్య కళాశాల ఉప ప్రిన్సిపల్ రాజునాయుడు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, పూర్వ ఆచార్యులు ఎన్‌వీఎస్ చౌదరి, రాధాకృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్ రాఘవశర్మ, రాష్ట్ర వైద్య మండలి ప్రతినిధి పద్మావతిదేవి, ఆచార్యులు జహీదాబాను, మల్లేశ్వరమ్మ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





పట్టాలు ప్రదానం చేస్తున్న డాక్టర్ గోఖలే, ప్రమాణం చేస్తున్న విద్యార్థులు



నా పట్టా మా తాతయ్యదే



మనవడా.. సరిగా నిలబడు